

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 30-11-2025 సంపుటి: 07 సంచిక 203 పేజీలు: 8 వెల: రూ 3-00

## పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 10 కీలక బిల్లులు...

### డిసెంబర్ 1 నుంచి ప్రారంభం



న్యూఢిల్లీ: పార్లమెంటు శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19వ తేదీ వరకూ ఈ సమావేశాలు జరుగుతాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ అఖిలపక్ష సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రైవేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ది ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా 10 కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి.పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ది ఆటకమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసి)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, ది హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, ది మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉండనున్నాయి.సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది. జాతీయ రహదారుల విస్తరణ, పొడిగింపుకోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగంగా, అత్యంత పారదర్శకంగా జరిగేందుకు వీలుగా నేషనల్ హైవేస్ (సవరణ) బిల్లును తెస్తోంది. చేయని తప్పులకు కంపెనీ డైరెక్టర్లు బాధ్యులు అవుతున్నందున అవాంఛనీయ దర్యాప్తు, విచారణల నుంచి రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఆర్బిట్రేషన్, కాన్సిలేయేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. దీనిపై సూచనల కోసం కమిటీకి సిఫారసు చేసే అవకాశం ఉంది. కాగా, ది హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లుతో ఏకీకృత ఉన్నత విద్యా కమిషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకురానుంది. కాగా, చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లు పార్లమెంటులో ప్రవేశపెడతారని అనుకున్నప్పటికీ అలాంటి ఆలోచన ఏదీ లేదని ఇటీవల కేంద్రం ప్రకటించింది.కాగా, ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు విపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా ఎస్ఐఆర్ ఓటర్ల సవరణ జాబితా, అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి.




## ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్.. జాగ్రత్త సుమీ!

అమరావతి, నవంబరు29: నైరుతి బంగాళాఖాతం ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో దిత్వా తుఫాను ప్రభావం కొనసాగుతోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రస్తుతానికి ఇది కారైకాల్‌కి 150 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 280 కిలోమీటర్లు, చెన్నైకి 350 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతం అయిందని వెల్లడించారు. గడిచిన 6 గంటల్లో 8 కిలోమీటర్ల వేగంతో తుఫాను కదులుతుందని వివరించారు.ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న తుఫాను చెన్నైకి అతి సమీపానికి వస్తుందని వివరించారు. ఈరోజు రాత్రికి తుపాను 60కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని చెప్పుకొచ్చారు. తీరానికి సమాంతరంగా ప్రయాణిస్తూ ఆయా ప్రాంతాలపై ప్రభావం చూపుతుందని అన్నారు. మూడు రోజుల్లో ఏపీలో కొన్నిచోట్ల భారీ, మరికొన్ని చోట్ల అతి భారీ, ఇంకొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. రెండు రోజుల వరకు తుఫాను తీరం దాటే పరిస్థితి లేదని అన్నారు. తీరం దాటకుండానే తుఫాను క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు.రేపు(ఆదివారం)తెల్లవారుజామునకు తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తాంధ్ర తీరాలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. తుఫాను ప్రభావంతో ఇవాళ(శనివారం) చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు. తుఫాను ప్రభావం దృష్ట్యా మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు తిరిగి రావాలని కోరారు. మూడు రోజులపాటు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు

## రైతన్నల్లారా.. సమస్యలన్నీ పరిష్కరిస్తాం: సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబర్ 29: రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని.. ఇందుకు అనుగుణంగా 3 ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శనివారం నాడు మీడియాతో సీఎం ఇష్టాగోష్టి నిర్వహించారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికో పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. రాజధాని రైతులంతా ఇక ఒకే గొడుగు కిందకు రావాలని పిలుపునిచ్చారు. అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జేఏసీగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాజధాని రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు గురించి కేంద్ర ఆర్థిక మంత్రికి వివరించామని.. కేంద్రంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారని తెలిపారు. రాష్ట్ర పరిధిలో ఉన్న సమస్యలన్నీ దశలవారీగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. పనుల కోసం ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లే రాజధాని రైతుల నుంచి సిబ్బంది డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. భూ త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా డబ్బులు డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీఆర్డీఏ అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. త్వరలోనే ఆ దిశగా కార్యచరణ రూపొందిస్తామని ప్రకటించారు. రైతు సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ వచ్చిందని.. అయితే తనతో సమావేశం తర్వాత అన్నింటిపైనా స్పష్టత వచ్చిందని వెల్లడించారు.రైతులు కూడా ఆనందంగా ఉన్నారన్నారు. రెండో దశ భూ సమీకరణ ఉపయోగాలపై రైతులకు వివరించినట్లు చెప్పారు. మునిస్పాలిటీగా అమరావతి మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారన్నారు. త్రిసభ్య కమిటీ నిరంతరం రైతులతో సంప్రదింపులు జరుపుతోందన్నారు. రాజధాని అభివృద్ధి ఇక అన్ స్టాపబుల్ అని స్పష్టం చేశారు. రాజధాని చుట్టపక్కల ప్రాంతాల్లో లేఅవుట్లకు అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసే దిశగా కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.కాగా.. టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు చేరుకున్న సీఎం.. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అలాగే కొందరికి అక్కడికక్కడే పరిష్కారాలు చూపారు. సీఎంకు వినతులు ఇచ్చేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు. దీంతో ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా కార్యాలయ సిబ్బంది సీటింగ్ ఏర్పాటు చేశారు. సీఎం చంద్రబాబు ఎంతో ఓపిగ్గా ఒక్కొక్కరి వద్దకు వెళ్లి సమస్య తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

## బాబు సర్కార్ కీలక నిర్ణయం.. ఏపీకి కొత్త సీఎస్



అమరావతి, నవంబరు29 : ఏపీ నూతన సీఎస్‌గా జి.సాయిప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. 2026 మార్చి ఒకటో తేదీ నుంచి సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత సీఎస్ కె. విజయానంద్ పదవీకాలాన్ని మరో మూడు నెలలు (మార్చి 28, 2026) పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది ఏపీ సర్కార్. ఈ మేరకు జీవో నంబర్ 2230ను విడుదల చేసింది ప్రభుత్వం. మరోవైపు.. పదిమంది డిప్యూటీ కలెక్టర్‌లకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీవో ఆర్టీ నెంబర్ 2228 జారీ చేశారు సీఎస్ విజయానంద్






## కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం:రాష్ట్ర పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్



కర్నూలు నవంబర్ 29 కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయిలో పేదలకు వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకుం టున్నాం అని,ఆమేరకుఆస్పత్రిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్తామని మంత్రి టి.జి.భరత్ తెలిపారు.శనివారం ఉదయం సర్వజన ఆసుపత్రిలో రూపాయలు 41 లక్షలు ఖర్చుతో ఆధునీకరించిన 4 గదుల పేయింగ్ బ్లాక్ ను పరిశ్రమలు , వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ప్రారంభించారు. అనంతరం మంత్రి టి.జి.భరత్ మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ... కర్నూలు సర్వజన ఆసుపత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని, ప్రస్తుతం పేయింగ్ బ్లాక్ లో నాలుగు గదుల సముదాయాన్ని ఆధునికరించి ప్రారంభించామని , ఇందులో ఒకటి సూట్ రూము, మిగిలినవి మూడు ఏసీ గదులని ,ఇవి కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో ఉన్నాయని, డబ్బులు చెల్లించి వినియోగించుకునే వారికి సౌకర్యంగా ఉంటాయని తెలిపారు. ఇంకా ఆస్పత్రిలో అవసరం మేరకు వివిధ విభాగాల్లో ఆధునిక పేయింగ్ బ్లాకులను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కర్నూలు మెడికల్ కాలేజ్ నుండి ఎంతోమంది ప్రఖ్యాత డాక్టర్లుగా దేశ విదేశాల్లో సేవలు చేస్తున్నారని తెలిపారు. వారి సలహాలు మరియు ప్రముఖ డాక్టర్లను ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో తీసుకొని వారి సూచనల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ ఆసుపత్రిలో ప్రముఖ వైద్యులు సేవలు అందిస్తూ ఉన్నందున మరియు మంచి సౌకర్యాలు ఉన్నందున ప్రక్క నున్న రాష్ట్రాల నుండి జిల్లాల నుండి వైద్య సేవలు పొందడానికి వస్తూ ఉంటారని వారికి అన్ని సేవలు ఇక్కడ లభిస్తాయని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం రెండు మూడు టర్మ్ లు పనిచేయగలిగితే గుజరాత్ ప్రభుత్వం లాగా ఆంధ్రప్రదేశ్ కూడా గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సిఎస్ఆర్ నిధులతో అందుబాటులోకి రావడం శుభ పరిణామం అని, ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు ఉండటం వలన వీటిని ఐసీయూ లాగా కూడా వినియోగించుకోవచ్చని, డబ్బులు చెల్లించ గల వారికి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్లేయింగ్ బ్లాక్ విషయం మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించి రూపంలో రూ 41 లక్షల నిధులు అందించి ప్రస్తుతం నెలల లోపల ఈ పనులు పూర్తయ్యాయని తెలియజేశారు.

# సంపాదకీయం

ఆదివారం 30-11-2025

## కన్నడలో కుర్చీలాట..

కర్ణాటక రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మొన్నటిదాకా అధిష్ఠానం మాటకు కట్టుబడి ఉన్నామని అటు సీఎం సిద్ధరామయ్య.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ గంభీరంగా పేర్కొన్నప్పటికీ లోలోపల మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. హైకమాండ్ మాటకు కట్టుబడి ఉన్నానని పేర్కొన్న డీకే శివ కుమార్ తాజాగా తన 'ఎక్స్' ఖాతాలో 'ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే ప్రపంచంలో పెద్ద శక్తి' అని ట్వీట్ చేశారు. దీనికి కౌంటర్‌గా సిద్ధరామయ్య.. 'మేము కర్ణాటకకు ఇచ్చిన మాట కేవలం నినాదం కాదు.. అదే మాకు సర్వస్వం' అని ట్వీట్ చేశారుఈ పరిణామాల నేపథ్యంలోనే కన్నడ రాజకీయం ఢిల్లీకి మారింది. 2023లో కర్ణాటకకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీకి మించి 23 సీట్లు అధికంగా సాధించి కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చింది. కర్ణాటకలో కాంగ్రెస్ విజయానికి సిద్ధరామయ్యతో పాటు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడైన డీకే శివకుమార్ శక్తికి మించి పనిచేశారు. దీంతో ఐదేళ్ల పాలనలో రెండున్నరేళ్లు పూర్తి కాగానే అధికార మార్పిడి జరగాలని ఒప్పందం కుదిరింది. ఒప్పందం మేరకు సిద్ధరామయ్య ఈ ఏడాది నవంబర్ వరకు ముఖ్యమంత్రిగా కొనసాగి ఆ తర్వాత సీఎం పగ్గాలను డీకేకు అప్పగించాలికానీ సిద్ధరామయ్య పార్టీ కేంద్ర నాయకత్వంతో భేటీ అయ్యి ఐదేళ్లు తానే సీఎంగా ఉండేలా అనుమతులు తెచ్చుకోవడంలో తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. ఇదే సమయంలో డిప్యూ టీ సీఎంగా ఉన్న డీకే శివకుమార్ కూడా సీఎం కుర్చీని వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపించింది. నిజానికి కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో డీకే పాత్ర మరువలేనిది. రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడిగా అన్ని వర్గాలను కలుపుకుని పోయి సమన్వయంతో వ్యవహరించి పార్టీని విజయపథంలో నడిపించారు. అయితే అపార పరిపాలన అనుభవం కలిగిన సిద్ధరామయ్యకే సీఎం పదవి ఇచ్చేందుకు అధిష్ఠానం మొగ్గుచూపింది. హైకమాండ్ ఆదేశాలను తాను శిరసావహిస్తానని డీకే చెప్పడంతో సమస్య చల్లబడినట్లుగా అనిపించింది. ఈ నవంబర్ 20తో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తి కావడంతో అధికార మార్పిడి అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. శివకుమార్‌ను పొలిటికల్ మాస్టర్ మైండ్‌గా అభివర్ణించినప్పటికీ.. పాలన విషయంలో సిద్ధరామయ్య ఒక మెట్టు ముందు ఉంటారు. జనతాదళ్ నుంచి బహిష్కరణకు గురై 2006లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న సిద్ధరామయ్య పార్టీలో అగ్రస్థానానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి పీఠం కోసం సిద్ధరామయ్య , డీకే శివకుమార్ మధ్య పోరు కొనసాగుతుండగా ఉప ముఖ్యమంత్రికి పదోన్నతి కల్పించాలని కోరేందుకు ఆయన మద్దతుదారులు ఢిల్లీకి క్యూ కడుతున్నారు. కాగా పార్టీ అధిష్టానం నిర్ణయిస్తే ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని సిద్ధరామయ్య సోమవారం వెల్లడించారు. ఇప్పటికే ఢిల్లీలో మకాం వేసిన కొందరు ఎమ్మెల్యేలకు అదనంగా డీకే శిబిరానికి చెందిన మరో ఆరుగురు ఎమ్మెల్యేలు సోమవారం ఢిల్లీ చేరుకోగా మరికొందరు కూడా హస్తిన బాట పట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా నాయకత్వ మార్పుపై పార్టీ అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకుంటుందని, దాన్ని తనతోపాటు డిప్యూటీ సీఎం కూడా అంగీకరించక తప్పదని సిద్ధరామయ్య విలేకరులకు చెప్పారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయానికి మేము కట్టుబడి ఉంటాం.నవంబర్ 20వ తేదీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి మార్పు జరగవచ్చుని జోరుగా ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు తాను కూడా ముఖ్యమంత్రి రేసులో ఉన్నానంటూ మాజీ కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వర ప్రకటించడం కలకలం రేపుతోంది.ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాటలు తనకు వేద వాక్యం లాంటివని శివకుమార్ సోమవారం వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు గురించి జోరుగా ఊహాగానాలు సాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయిస్తే తాను ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతానని, అధిష్టానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను, డీకే శివకుమార్ కట్టుబడి ఉండాల్సి ఉంటుందని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై సోమవారం విలేకరులు ప్రశ్నించినపుడు తాను కూడా ముఖ్యమంత్రి ప్రకటనతో ఏకీభవిస్తున్నానని డీకే చెప్పారు.2013లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంతో పాటు సీఎంగా ఐదేళ్ల పాటు ప్రభుత్వాన్ని సమర్థంగా నడిపించారు. ఇటు సిద్ధూ.. అటు డీకేల్లో ఉన్న ప్రత్యేక లక్షణాలే ఇవాళ హైకమాండ్‌కు సీఎం మార్పు తలనొప్పిగా మారిపోయింది. 2006లో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి.పాలనా ఒప్పందంలో భాగంగా రెండున్నరేళ్లు పూర్తయిన తర్వాత జేడీఎస్ అధినేత కుమారస్వామి అయిష్టంగానే సీఎం పదవి నుంచి తప్పుకొని ఆ బాధ్యతలు బీఎస్ యడ్యూరప్పకు అప్పగించారు. ప్రస్తుతానికి సీఎం సిద్ధరామయ్య పదవికి ఎలాంటి ముప్పు లేదని తెలుస్తోంది. కర్ణాటక రాష్టంలో ఓబీసీలదే రాజ్యమని కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలుసని నివేదికలు చెబుతున్నాయి ఆయనకు అహింద వర్గంతో పాటు పార్టీలోని 100 మందికి పైగా ఎమ్మెల్యేల మద్దతు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సభలో మొత్తం 137 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ క్రమంలో సిద్ధరామయ్య అంగీకారం లేకుండా ముఖ్యమంత్రిని మార్చడం అనేది కష్టం.కర్ణాటక రాష్ట్ర వెనుకబడిన తరగతుల సమాఖ్య కాంగ్రెస్‌ను హెచ్చరించింది. రాష్ట్ర యూనిట్‌లో అంతర్గత కలహాల నేపథ్యంలో సిద్ధరామయ్యను సీఎం పదవి నుంచి తొలగించడానికి ఏ ప్రయత్నం చేసినా అది పార్టీపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. మరోవైపు కర్ణాటక రాష్ట్ర వొక్కలిగ సంఘం కూడా ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్న ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌కు అన్యాయం జరిగితే.. వారు దానిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని హెచ్చరించింది. ముఖ్యమంత్రిని మార్చాలని సిద్ధరామయ్య వర్గంపై ఒత్తిడి తెస్తే వారు అధిష్ఠానానికి పేర్ల జాబితాను సమర్పిస్తారని గత కొద్ది రోజులుగా మీడియా నివేదికలలో వెల్లడైంది.

## దీక్షా దివస్‌ను దసరా, దీపావళి తరహాలో జరుపుకోవాలి.. బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ పిలుపు

హైదరాబాద్, దీక్షా దివస్ అంటే ఓ పండుగ, ఓ ప్రతిజ్ఞ అని.. దీక్ష దీవస్ అంటే కేసీఆర్ దీక్ష చేసిన రోజు మాత్రమే కాదని.. ఎప్పటికప్పుడు ఒక దసరా, దీపావళి మాదిరి జరుపుకోవాల్సిన అవసరం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు



అన్నారు. ఆ పండుగలో ఉన్న స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలని.. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఆ పండగలు చేసుకున్నట్లుగానే.. దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ సోయికి సాన పెట్టుకోవాలని, తెలంగాణ ఆత్మగౌరవాన్ని రగిలించుకోవాలని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేయాలని కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. దీక్షా దివాస్ అంటే ఒక సందర్భం.. ఒక సంఘటన కాదని.. 60 సంవత్సరాల తెలంగాణ చరిత్రను తలుచుకొని, తెలంగాణ కోసం మరోసారి పునరంకితం కావాల్సిన రోజు అన్నారు.ఆగస్టు 15 రోజు జాతీయ జెండా ఎగరవేసి తెల్లదొరల దోపిడీని, బ్రిటిష్ వాళ్ల దుర్మార్గాలను గుర్తుచేసుకున్నట్లుగానే.. నవంబర్ 29 దీక్షా దివస్ నాడు, డిసెంబర్ 9 విజయ్ దివస్ నాడు, జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇచ్చిన మాట తప్పి 1,000 మందికి పైగా బిడ్డల చావుకు కారణమైన కాంగ్రెస్ పార్టీని, లేలేత పిల్లల ఉసురు పోసుకున్న కాంగ్రెస్ ద్రోహాన్ని గుర్తుంచుకోవాల్సిన రోజన్నారు. మరోసారి రాణి రుద్రమ, సమ్మక్క సారక్క, కొమురం భీమ్, సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ వంటి వీరులందరి స్ఫూర్తితో ఈ తెలంగాణకు దక్కిన స్వాతంత్రాన్ని కాపాడుకుంటూ.. ఢిల్లీ సామంత రాజుల నుంచి విముక్తి కల్పించాల్సిన అవసరం మరోసారి ఉందన్నారు.16 మంది ఎంపీలను జాతీయ పార్టీలకు కట్టబెడితే తెలంగాణ గొంతుక పార్లమెంటులో మూగబోయింది అని ఉద్యమ పార్టీగా, తెలంగాణ కడుపున పుట్టిన పార్టీ, తెలంగాణను కడుపులో పెట్టుకునే పార్టీ భారత రాష్ట్ర సమితి అన్నారు. అలాంటి పార్టీ వల్లనే తెలంగాణకు బలం వస్తుందని, కేసీఆర్ గళంతోనే తెలంగాణ మరోసారి నిలబడుతుంది అన్నారు. కేసీఆర్ మాట, మౌనం రెండు సంచలనమే అని, రెండు సంవత్సరాలుగా తెలంగాణలో కేసీఆర్ మాట లేకుండా రాజకీయం నడవడం లేదని, అంతటి బలమైన ముద్ర కేసీఆర్‌దని అన్నారు. మాయ మాటలతో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అరాచకాలను, అవినీతిని ఎప్పటికప్పుడు ఎత్తి చూపుతూ తెలంగాణను కాపాడుకుందామని బీఆర్ఎస్ నేతలకు పిలుపునిచ్చారు.

## రేపటి నుండి ఖమ్మం రూరల్ మండలంలో నామినేషన్ల స్వీకరణ

**మండల వ్యాప్తంగా 8 క్లస్టర్ల ఏర్పాటు**

**21 గ్రామాలు, 202 వార్డులు**

ఖమ్మం రూరల్, నవంబర్ 29 : ఖమ్మం రూరల్ మండలంలో నామినేషన్ల స్వీకరణ ఆదివారం నుండి ప్రారంభం కానుంది. మండల పరిధిలోని 21 గ్రామాలు, 202 వార్డులకు పోటీ చేసే అభ్యర్థుల నుండి సంబంధిత ఎన్నికల అధికారులు ఈ నెల 30 నుండి డిసెంబర్ 02 సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇందుకుగాను ఎన్నికల అధికారులు నామినేషన్ల స్వీకరణకు 8 క్లస్టర్లను ఏర్పాటు చేయడం జరిగింది. క్లస్టర్ నంబర్ 01 కామంచికల్ గ్రామపంచాయతీ ఆఫీస్‌లో కామంచికల్, దారేడు, పడమటి తండాకు సంబంధించిన సర్పంచులు, వార్డు సభ్యుల నుండి అధికారులు నామినేషన్లు స్వీకరించనున్నారు. క్లస్టర్ నంబర్ 2 పోలేపల్లి జీపీ ఆఫీస్‌లో





పోలేపల్లి, గొల్లపాడు, పల్లెగూడెం పంచాయతీలకు సంబంధించి, క్లస్టర్ నంబర్ 3 తీర్థాల గ్రామ పంచాయతీ ఆఫీసులో తీర్థాల, మంగళగూడెం, పోలిశెట్టి గూడెం, క్లస్టర్ నంబర్ 4 గూడూరుపాడు జీపీ కార్యాలయంలో గూడూరుపాడు, తనగంపాడు, తస్న తండా పంచాయతీల సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ఉంటుంది. క్లస్టర్ నంబర్ 5 ఎం వెంకటయ్యపాలెం జీపీ ఆఫీస్‌లో ఎంవి పాలెం గ్రామానికి సంబంధించిన సర్పంచ్, వార్డు మెంబర్లకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించనున్నారు. క్లస్టర్ నంబర్ 6 ఆరెంపుల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరెంపుల, కొండాపురం గ్రామాల సర్పంచ్, వార్డు మెంబర్లకు సంబంధించిన నామినేషన్లను స్వీకరించనున్నారు. క్లస్టర్ నంబర్ 7 ఆరెకోడు గ్రామ పంచాయతీ ఆఫీసులో ఆరెకోడు, ఆరెకోడుతండా, చింతపల్లి గ్రామాలకు సంబంధించిన నామినేషన్లను అధికారులు స్వీకరిస్తారు. అదేవిధంగా క్లస్టర్ నంబర్ 8 తల్లంపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో తల్లంపాడు, పొన్నెకల్లు గ్రామాలకు సంబంధించిన నామినేషన్లను అధికారులు స్వీకరించడం జరుగుతుంది. డిసెంబర్ 14వ తేదీన సర్పంచ్, వార్డు మెంబర్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 35,797 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

## తెలంగాణకు చరిత్ర కేసీఆర్ : ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

**బీఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ ఎమ్మెల్యే వనమా, మెచ్చా, హరిప్రియ, దిండిగల**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 29 : తెలంగాణ చరిత్ర కేసీఆర్ అని, దానిని ఎవరు చెరపలేరని బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్‌లో శనివారం నిర్వహించిన దీక్ష దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ప్రగతి మైదానంలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పించి,



తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు కూడా కీలక పాత్ర పోషించారన్నారు. నాడు కేసార్ తెచ్చిన తెలంగాణ వల్లే నేడు ఎంతో మంది నాయకులు ప్రజా ప్రతినిధులుగా పదవులు అనుభవిస్తున్నారని అది కాంగ్రెస్ నాయకులు తెలుసుకోవాలన్నారు. కేసీఆర్ లేని తెలంగాణ ఎవరూ చూడలేరన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు.బీసీలను మోసం చేసి రిజర్వేషన్లకి అడ్డుపడ్డారని దమ్ముంటే ఎంపీటీసీ ఎన్నికలకైనా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని, పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టాలన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపెడతామని, అందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అంకుటిత దీక్ష వల్లే మనకు తెలంగాణ వచ్చిందన్నారు. ఎంతోమంది నాయకులు తెలంగాణ కోసం కష్టపడినా చివరికి సాధించలేకపోయారని, కానీ అది కేసీఆర్ వల్లే సాధ్యమైందన్నారు. కేసీఆర్ తెలంగాణ తీసుకురావడం వల్లే ఈరోజు ముఖ్యమంత్రి స్థానంలో రేవంత్ రెడ్డి ఉన్నారని, లేకుంటే ఇలాంటి పదవులు వచ్చేవా అని ఆయన ప్రశ్నించారు.మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వర్‌రావు, హరిప్రియ, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఉద్యమం, తెలంగాణ సాధన గురించి ప్రస్తావించారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపెడతామని హామీ ఇచ్చారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఇన్‌చార్జి రావులపల్లి రాంప్రసాద్, పాల్వంచ నాయకులు మంతపురి రాజు గౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, కాంపెల్లి కనకేశ్, సింధు, తపస్వి, సంకుబాపన అనుదీప్, బత్తుల వీరయ్య, పొగరు రాజశేఖర్, నవతన్, మాజీ ఎంపీపీలు సోనా, బాధావత్ శాంతి, అరుణ పాల్గొన్నారు.

## కేసీఆర్ ఉద్యమ ప్రస్థానం ప్రపంచానికే ఆదర్శం : బీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ సభ్యులు




బీఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల ఆదేశాల మేరకు అధ్యక్షుడు నాగరాజు గుర్రాల ఆధ్వర్యంలో సౌతాఫ్రికాలో బీఆర్ఎస్ ఎన్నారై సౌతాఫ్రికా శాఖ సభ్యులు దీక్షా దివస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షా దివస్ స్ఫూర్తిని, అమరుల త్యాగాలను, పోరాటాలను సౌతాఫ్రికా శాఖ స్మరించుకున్నది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదంతో తలపెట్టిన దీక్ష తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఒక కీలక ఘట్టమన్నారు.తెలంగాణ ప్రజల దశాబ్దాల కలను సాకారం చేసే క్రమంలో తన ప్రాణాలను పణంగా పెట్టి.. సకల జనులను ఏకం చేసి శాంతియుత పోరాటంతో రాష్ట్రాన్ని సాధించి పెట్టిన కేసీఆర్ ఉద్యమ ప్రస్థానం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమానికి సౌతాఫ్రికా శాఖ సభ్యులు కిరణ్ కుమార్ బెల్లి,రాంబాబు తోడుపునురి, రాజయ్య చికోటి ,అరవింద్ చికోటి, సౌజన్ రావు,పోరండ్ల సుమన్ ,సాయి కిరణ్ వేముల పాల్గొన్నారు.

## చుంచుపల్లి మండలంలో ఐదు నామినేషన్ స్వీకరణ కేంద్రాల ఏర్పాటు

**మండలంలో 18 గ్రామ పంచాయతీలు, 168 వార్డులు**




చుంచుపల్లి, నవంబర్ 29 : చుంచుపల్లి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల పర్వం రేపటి నుండి కొనసాగనుంది. ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు ఆదివారం నుండి డిసెంబర్ 2వ తేదీ వరకు నామినేషన్లు వేయనున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలు, 168 వార్డులకు గాను అధికారులు 5 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. రుద్రంపూర్ పంచాయతీ కార్యాలయం నందు రుద్రంపూర్, గౌతమ్‌పూర్, ధన్బాద్, పెనుగడప పంచాయతీ కార్యాలయంలో పెనగడప, అంబేద్కర్ నగర్, రాంపురం, వెంకటేష్ ఖని, త్రీ ఇంక్లైన్ పంచాయతీ కార్యాలయంలో త్రీ ఇంక్లైన్, ఫోర్ ఇంక్లైన్స్, పెనుబల్లి, ప్రశాంతినగర్ నామినేషన్లు సమర్పించనున్నారు. విద్యానగర్ కాలనీ పంచాయతీ కార్యాలయంలో విద్యానగర్, చుంచుపల్లి తండా, నందా తండా, వేంకటేశ్వర కాలనీ, బాబు క్యాంప్ పంచాయితీ కార్యాలయంలో బాబు క్యాంప్, ఎన్.కె.నగర్, రామాంజనేయ కాలనీ గ్రామ సర్పంచులు, వార్డ్ మెంబర్లుగా పోటీ చేయువారు నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. నామినేషన్ సెంటర్లు నందు ఇబ్బంది లేకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

## ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వహించాలి : సింగరేణి ఎంపీడీఓ శ్రీనివాసరావు




కారేపల్లి, నవంబర్ 29 : స్థానిక సంస్థల ఎన్నికల విధులను పోలింగ్ అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని ఖమ్మం జిల్లా సింగరేణి మండల ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ జయరాజు అన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శనివారం కారేపల్లిలో గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సింగరేణి మండల ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ అధికారులకు మాస్టర్ ట్రైనర్ శేఖర్ తో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల రోజు నిర్వహించే విధుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ రమేశ్, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్, టెక్నీషియన్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, వినుకొండ నియోజకవర్గం, నూజెండ్ల మండలం, తలార్లపల్లి గ్రామంలో 'రైతన్న మీకోసం' కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు శనివారం పాల్గొన్నారు. ఆయన స్వయంగా మిరప పొలంలోకి వెళ్లి, రైతన్నలతో కలిసి వారి కష్ట సుఖాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మిరప సాగులో ఎదురవుతున్న సమస్యలు, ప్రస్తుత పంట పరిస్థితులు, ప్రభుత్వం నుండి ఆశిస్తున్న సహాయం తదితర అంశాలపై రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సానుకూలంగా స్పందించిన చీఫ్ విప్, వారి సమస్యలను త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# కూటమి చేతికి మండలి

విజయవాడ, నవంబర్ 29,వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. వారి రాజీనామాలు విషయంలో కోర్టు నాలుగు వారాల పాటు గడువు విధించింది. జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించడంతో ఈ మేరకు తీర్పు వచ్చింది. దీంతో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం శాసనమండలి ఛైర్మన్ పై ఏర్పడింది. గత ఏడాది కాలంగా ఎమ్మెల్సీల రాజీనామా వ్యవహారం నలుగుతూనే ఉంది. వైసీపీ రాజకీయ అవసరాల కోసం శాసనమండలి అవసరం. ఛైర్మన్ మోసేన్ రాజు ఆ పార్టీకి చెందిన నేత కావడంతో హై కమాండ్ నుంచి ఇంతవరకు ఎమ్మెల్సీల రాజీనామా పై ఆదేశాలు రాలేదు. దీంతో ఛైర్మన్ సైతం ఆ రాజీనామాలను ఆమోదించలేదు. అయితే ఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. ఇప్పుడు అదే శాసనమండలి ఆయనకు అక్కరకు వస్తోంది.ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చాలామంది వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు పార్టీకి గుడ్ బై చెప్పారు. కర్రీ పద్మశ్రీ, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకీయా ఖానం తదితర ఎమ్మెల్సీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. అయితే రాజీనామా ఆమోదానికి నోచుకోకపోవడంతో వారు తమకు నచ్చిన కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇందులో జనసేనలో చేరిన జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించారు. నాలుగు వారాల్లో ఒక నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. అయితే రాజీనామాలను ఆమోదించిన మరుక్షణం మరికొంతమంది రాజీనామా చేసే అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం తగ్గిపోయినట్లేఇదే శాసనమండలిని జగన్మోహన్ రెడ్డి వ్యతిరేకించారు. 2019లో వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 151 సీట్లతో ఘనవిజయం సాధించింది. అయితే అప్పటికే తెలుగుదేశం పార్టీకి శాసనమండలిలో బలం ఉంది. ఆ పార్టీ నేత మండలి ఛైర్మన్ గా ఉండేవారు. కీలక బిల్లులతో పాటు వైసీపీ ప్రభుత్వ నిర్ణయాలకు శాసనమండలిలో తెలుగుదేశం పార్టీ అభ్యంతరాలు చెప్పేది. బిల్లులను అడ్డగించేది. దీంతో జగన్మోహన్ రెడ్డి ఏకంగా శాసనమండలిని రద్దు చేయాలని కోరుతూ కేంద్రానికి నివేదిక ఇచ్చారు. అయితే అప్పట్లో కేంద్రం దీనికి సమ్మతం తెలపలేదు. అప్పట్లో కేంద్రం అనుమతి ఇచ్చి ఉంటే ఇప్పటికే రద్దు జాబితాలో శాసనమండలి చేరిపోయేది.2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమికి అనుకూలంగా పనిచేసారని రఘురాజు అనే వైసిపి ఎమ్మెల్సీ పై వేటు వేశారు ఛైర్మన్ మోసేన్ రాజు. విజయనగరం స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న రఘురాజు పై వేటు పడడంతో ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికకు సిద్ధపడింది. కానీ కోర్టు స్టే విధించడంతో ఎన్నిక ప్రక్రియ నిలిచిపోయింది. అయితే స్వయంగా ఎమ్మెల్సీలు రాజీనామా చేస్తే మాత్రం ఛైర్మన్ ఆమోదం తెలపడం లేదు. అయితే ఇప్పుడు జయ మంగళం వెంకటరమణ కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ఇచ్చే ఆదేశాలు కీలకంగా మారనున్నాయి. ఎమ్మెల్సీల రాజీనామా ఆమోదం తెలిపితే మాత్రం శాసనమండలిలో మిగతా ఎమ్మెల్సీలు సైతం రాజీనామా బాటకు అవకాశం ఉంది. అదే జరిగితే శాసనమండలి సైతం టిడిపి కూటమికి చిక్కినట్టే.

# తిరుమలలో ఏం జరుగుతోంది..

తిరుమల, నవంబర్29,ఆ రెండు కేసులు ఏపీ పాలిటిక్స్‌ను షేక్ చేస్తున్నాయ్. కోట్లాది మంది భక్తుల విశ్వాసం..భక్తుల కొంగుబంగారంగా ఉన్న తిరుమల శ్రీవారి..కొండ చుట్టూ తిరుగుతున్న ఆ రెండు ఇష్యూస్‌పై రచ్చ కంటిన్యూ అవుతోంది. పరకామణి చోరీ కేసు అయితే బిగ్ టర్న్ తీసుకుంది. పరకామణి చోరీ కేసులో నిందితులను ఎప్పుడో గుర్తించారు. అతడి ఆస్తులపై దర్యాప్తు నడుస్తోంది. కీలక సాక్షిగా ఉన్న సతీష్‌కుమార్ అనే అధికారి అనుమానాస్పద మృతి చెందడంతో పరకామని కేసు క్లైమాక్స్‌లో బిగ్ టర్న్ తీసుకున్నట్లు అయ్యింది.ఇక హుండీ చోరీ కేసులో టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ విచారించింది. ప్రశ్నలు వేసి ఏం జరిగిందనే దానిపై ఆరా తీసింది. పరకామణి చోరీ చేసిన రవికుమార్ ఆస్తుల జప్తులో ఏం జరిగింది.? ఎంత చోరీ జరిగితే..ఎన్ని ఆస్తులు జప్తు చేశారు.? రాజీ కుదర్చిందెవరు.? ఎవరి ఒత్తిడి వల్ల ఇదంతా చేశారని.? ఆరా తీస్తుంది సీఐడీ. నిందితులతో భూమన, ధర్మారెడ్డి, వైవీసుబ్బారెడ్డికి ఉన్న లింకులపై కూపీ లాగుతోంది. ఈ క్రమంలోనే సంచలనం సృష్టించిన టీటీడీ పరకామణి కేసులో దర్యాప్తు స్పీడప్ చేశారు సీఐడీ అధికారులు. టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని సీఐడీ మూడుసార్లు ప్రశ్నించిందిపరకామణిలో దొంగతనానికి పాల్పడ్డ వ్యక్తిని కాపాడేందుకు గత ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తులే దగ్గరుండి వ్యవహారాన్ని నడిపించారని, చివరకు కేసు పెట్టినా కూడా లోక్ అదాలత్‌లో కొట్టేసేలా ఒత్తిడి తెచ్చారని ఆరోపణలున్నాయి. ఇదంతా జరగడానికి కోట్లు చేతులు మారాయనే అభియోగాలు లేకపోలేదు. ఈ క్రమంలో అన్ని కోణాల్లో దర్యాప్తు అధికారులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ కేసు అతిపెద్ద చిక్కుముడిగా మారింది. కీలక సాక్షి లేటెస్ట్‌గా మృతి చెందడంతో కేసు మరింత జటిలం అవుతోందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయ్. పరకామణి కేసులో కూడా మరోసారి వైవీ సుబ్బారెడ్డికి సీఐడీ నుంచి పిలుపురావడం రకరకాల చర్చకు దారితీస్తోంది.ఇక తిరుమల కల్తీ నెయ్యి కేసు కూడా కొత్త టర్న్ తీసుకుంటోంది. సుప్రీం ఆదేశాలతో ఏర్పాటైన స్పెషల్ సిట్..ఇప్పటికే టీటీడీ మాజీ ఈవో ధర్మారెడ్డిని విచారించింది.



టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్నను అరెస్ట్ చేసింది. లేటెస్ట్‌గా వైవీ సుబ్బారెడ్డిని కూడా హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో ప్రశ్నించింది స్పెషల్ సిట్ టీమ్. అయితే 2019 నుంచి 2014 వరకు జరిగిన నెయ్యి సరఫరాపై మాత్రమే ఎందుకు విచారణ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు వైవీ సుబ్బారెడ్డిపదేళ్లలో నెయ్యి సప్లైపై విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. లడ్డూ ఆరోపణలపై పాలీ గ్రాఫ్ పరీక్షకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించిన సుబ్బారెడ్డి..రాజకీయాలకు ఆలయాలను వాడుకుంటున్నారని ఆరోపించారు. స్వామివారి లడ్డూ ప్రసాద విషయంలో తనపై విషప్రచారం చేస్తున్నారని..కల్తీ నెయ్యి వ్యవహారంలో లైడిటెక్టర్ టెస్టుకైనా సిద్ధమని అంటున్నారు వైవీ సుబ్బారెడ్డి. తనకు కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులు ఉండగా..నెయ్యిలో అవినీతి ఎందుకు చేస్తానని ప్రశ్నిస్తున్నారు. పరకామణి విషయంలో ఏం జరిగిందో తనకు తెలియదంటున్న వైవీ సుబ్బారెడ్డి..శ్రీవారి సేవలో నీతి నిజాయితీతో పనిచేశానని చెప్తున్నారు.అటు దర్యాప్తు సంస్థల విచారణ కొనసాగుతుండగానే..ఏపీ ప్రభుత్వం మాత్రం నిందితుల పట్ల కఠినంగా ఉంటామని తేల్చి చెబుతోంది. తప్పుచేసిన వారిని శ్రీవారు వదిలిపెట్టరని..శిక్ష అనుభవించాల్సిందేనని హెచ్చరిస్తోంది. అయితే కల్తీ నెయ్యి కేసులో సిట్..పరకామణి కేసులో సీఐడీ దర్యాప్తు స్పీడప్ అవడం ఉత్కంఠ రేపుతోంది. ఓవైపు విచారణ కొనసాగుతుండగానే..ఓవైపు కల్తీ నెయ్యి..ఇంకోవైపు పరకామణి వ్యవహారంపై.. కూటమి, వైసీపీ మధ్య మాటల యుద్ధం సాగుతోంది.సమయం, సందర్భం దొరికినప్పుడల్లా కూటమి లీడర్లు రియాక్ట్ అవడం..తామేం తప్పు చేయలేదని వైసీసీ లీడర్లు వివరణ ఇచ్చుకుంటుండం..హాట్ టాపిక్‌గా నడుస్తోంది. పరకామణి కేసుతో పాటుకల్తీ నెయ్యి ఇష్యూలో కూడా వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి ఇద్దరు విచారణను ఫేస్ చేస్తుండటం వైసీపీకి హెడెక్‌గా మారింది. భూమన కరుణాకరెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి చుట్టూ ఈ రెండు కేసుల విచారణ కొనసాగుతుండటం బర్నింగ్ టాపిక్ అవుతోంది.అయితే ఈ ముగ్గురు వైసీపీ అధినేతకు జగన్‌కు సన్నిహితులు. వైవీ సుబ్బారెడ్డి అయితే జగన్‌కు బాబాయ్ అవుతారు. భూమన వైఎస్సార్ నుంచి జగన్ వరకు వాళ్ల ఫ్యామిలీ వెంట నడిచిన నేత. ఇక ధర్మారెడ్డి వైసీపీ హయాంలో టీటీడీలో అన్నీ తానై వ్యవహరించారు. ఈ ముగ్గురిని కార్నర్ చేసి..జగన్‌ను రాజకీయంగా వీక్ చేయాలని కూటమి కుట్ర చేస్తోందని ఆరోపిస్తోంది వైసీపీ. పరకామణి కేసు..కల్తీ నెయ్యి ఎపిసోడ్‌లో కన్‌క్లూజన్ ఎప్పుడో వేచి చూడాలి మరి

# 3 లక్షల కోట్లు దాటిన వైజాగ్ డేటా సెంటర్

విశాఖపట్టణం, నవంబర్ 29, ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం ఇప్పుడు దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ల హబ్గా రూపుదిద్దుకుంటోంది. టెక్ దిగ్గజాలు, ప్రపంచ స్థాయి సంస్థలు ఇక్కడ డేటా సెంటర్ల ఏర్పాటుకు క్యూ కట్టడంతో, మొత్తం పెట్టుబడులు ఏకంగా రూ. 3 లక్షల కోట్లకు పైగా చేరినట్లు తెలుస్తోంది.తాజాగా ఈ పెట్టుబడుల సునామీకి ఊతం ఇస్తూ రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో భారీ అడుగు వేసింది. రిలయన్స్, బ్రూక్‌ఫీల్డ్ , డిజిటల్ రియాల్టీ వంటి సంస్థల సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటైన 'డిజిటల్ కనెక్షన్' విశాఖలో ఒక గిగావాట్ సామర్థ్యం గల అత్యాధునిక ఏఐ డేటా సెంటర్‌ను నిర్మించనుంది.ఈ ప్రాజెక్టు కోసం రిలయన్స్ జాయింట్ వెంచర్ సుమారు రూ. 98,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టనుంది. 1,000 మెగావాట్ల హైపర్‌స్కేల్ ఏఐ డేటా సెంటర్. సుమారు 400 ఎకరాల విస్తీర్ణంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. 2030 నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా. రిలయన్స్‌తో పాటు ఇప్పటికే ప్రపంచ దిగ్గజ సంస్థలు విశాఖలో భారీ పెట్టుబడులు ప్రకటించాయి. దాదాపు రూ. 1.35 లక్షల కోట్లకు పైగా పెట్టుబడితో 1 ఉచి సామర్థ్యం గల ఏఐ డేటా సెంటర్. రూ. 1.10 లక్షల కోట్లతో డేటా సెంటర్ల నిర్మాణం. రూ. 16,000 కోట్ల పెట్టుబడితో 550 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్ల కాంప్లెక్స్. సబ్‌సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల ఏర్పాటు, సిఫీతో కలిసి 500 మెగావాట్ల ఏఐ డేటా సెంటర్ (రూ. 15,266 కోట్లు)మొత్తంగా, రాష్ట్ర ప్రభుత్వం 2030 నాటికి 6,000 మెగావాట్ల డేటా సెంటర్‌ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 3.65 గిగావాట్లకు పైగా ఒప్పందాలు కుదిరాయి. ఈ భారీ పెట్టుబడులతో విశాఖపట్నం రానున్న రోజుల్లో భారతదేశ 'డేటా రాజధాని'గా అవతరించడం ఖాయమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీని ద్వారా వేల సంఖ్యలో కొత్త ఉద్యోగాలు, నూతన సాంకేతిక ఆవిష్కరణలకు కేంద్రంగా వైజాగ్ మారనుంది.

# అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలు

విజయవాడ, నవంబర్ 29, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన అనుభవాన్ని ఉపయోగించి రాష్ట్రాన్ని గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. అందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈసారి మాత్రం ఆయనకు అనుభవం కన్నా అడ్డంకులే ఆటంకాలుగా మారే అవకాశాలున్నాయి. నిధుల కొరతతో పాటు సంక్షేమాన్ని అమలు చేయడం కత్తిమీద సాముగా మారింది. ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలను తిప్పికొట్టాలన్న ప్రయత్నంలో ఆయన ఇచ్చిన హామీలను అమలు చేశామని చెప్పేశారు. మహిళలకు నెలకు పదిహేను వందల రూపాయలు ఆడబిడ్డ పథకం కింద.. నిరుద్యోగులకు నెలకు మూడు వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీని ప్రతిపక్ష వైసీపీ పదే పదే గుర్తు చేస్తుంది.రెండు పథకాలు అమలు చేయాలంటే అంత సులువు కాదు. ఆడబిడ్డ పథకం అమలు చేయాలంటే ప్రభుత్వానికి చెందిన ఆస్తులు అమ్మాల్సిందేనని అచ్చెన్నాయుడు గతంలో చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా గుర్తుకు తెచ్చుకోవాలి. అర్హులు ఎందరు? ఎవరికి ఇస్తారన్న దానిపై పథకం క్లిక్ అయ్యేది ఆధారపడి ఉంటుంది. ఏదో కొందరికి ఇచ్చామని మమ అనిపించడానికి వీలులేదు. మహిళల్లో ఒకరికి వచ్చి పది మందికి పథకం రాకపోతే ఇరవై మంది వ్యతిరేకమవుతారు. నిరుద్యోగ భృతి కూడా అంతే. అది అమలుకు సాధ్యమయ్యే హామీ కాదు. నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయలు ఇవ్వాలంటే ఖజానా సరిపోదు. అందుకే చంద్రబాబు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.గతంలో సంక్షేమంపై చంద్రబాబు ఎన్నడూ ఇలా టెన్షన్ పడలేదు. ఆయన దృష్టంతా అభివృద్ధిపైనే ఉంది. గత ప్రభుత్వం అప్పులు చేసిందని, విధ్వంసం నుంచి బయటపడేస్తున్నామని చెప్పాలనుకున్నా కుదిరే పని కాదు. ఎందుకంటే ఇప్పటికే రెండేళ్ల సమయం పూర్తయింది. ప్రస్తుతం గ్రౌండ్ చేసిన హామీలను అమలు చేయడానికే అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రతి నెల అప్పుల కోసం ఢిల్లీ వైపు చూడాల్సి వస్తుంది.

# మరో 20 వేల ఎకరాలకు భూ సేకరణ

విజయవాడ, నవంబర్ 29,అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దేందుకు రెండో దశ భూసేకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. పెట్టుబడులు, ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ వంటి వాటికి భూములు అవసరమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన కేబినెట్ సమావేశంలో రెండో దశ భూసేకరణకు సంబంధించి చర్చించారు. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చింది రాష్ట్ర మంత్రివర్గం. ప్రభుత్వ భూమితో కలిపి మొత్తంగా 20 వేల ఎకరాలు సేకరించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ల్యాండ్ పూలింగ్ చేపట్టే గ్రామాలను మంత్రివర్గం పరిశీలించినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ కలల రాజధాని అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడానికి రెండోదశ భూసమీకరణ తప్పదని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం (నవంబర్ 27) అన్నారు. రాజధానిలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న సంస్థలకు భూములు లేవని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఎయిర్‌పోర్టు, స్పోర్ట్స్‌సిటీ, రైల్వేస్టేషన్ నిర్మించేందుకు కూడా భూములు అవసరమని చెప్పారు. ఇవన్నీ వస్తేనే అమరావతి ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నేపథ్యంలో రెండో దశ భూసేకరణ చేయడానికి రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నట్లు తీసుకుంది. 7 గ్రామాల పరిధిలో మరో 16,666 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతి ఇచ్చే ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రభుత్వ భూమితో కలిపి రెండో దశలో 20 వేల ఎకరాల భూమిని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో భూసేకరణతో పాటు దాదాపు 25కుపైగా అజెండా అంశాలపై చర్చించారు.ఈ కేబినెట్ సమావేశంలో భూసేకరణ చేయబోయే ప్రాంతాలను పరిశీలించినట్లు సమాచారం. హరిశ్చంద్రపురం, వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, వడ్డమాను, పెదమద్దూరు, పెదపరిమి వంటి ప్రాంతాలను పరిశీలించినట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో భూ లభ్యత, రికార్డులు, యాజమాన్యం, అభ్యంతరాలు వంటి అంశాలపై అధికారులు నివేదికలు సమర్పించినట్లు చెబుతున్నారు. వైకుంఠపురంలో 3,361 ఎకరాలు, పెదమద్దూరులో 1,145 ఎకరాలు, కర్లపూడిలో 2,944 ఎకరాలు, హరిశ్చంద్రపురంలో 2,418 ఎకరాలు , వడ్డమానులో 1,913 ఎకరాలు, పెదపరిమిలో 6,513 ఎకరాలు, ఎండ్రాయిలో 2,166 ఎకరాలు సేకరించాలనుకుంటున్నట్లు తెలుస్తోంది.రైతుల వద్ద నుంచి సేకరించిన భూమితో పాటు ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములతో కలిపి మొత్తం 20,494 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని సమాచారం. త్వరలో రెండో విడత ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే అమరావతి నిర్మాణానికి మొదటి విడతలో రైతుల నుంచి 34,000 ఎకరాలు సమీకరించారు. ఇప్పుడు రెండో విడతకు సిద్ధమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. వీటికి అదనంగా 16,000 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం సీఆర్డీఏకు అప్పగించనున్నట్లు తెలుస్తోంది. అంటే.. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి మొత్తం దాదాపు 70,0 00 ఎకరాల భూమి సిద్ధమవుతోందన్నమాట.కాగా, రాజధాని రైతులతో గురువారం సచివాలంలో సమావేశమయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రెండున్నర గంటల పాటు సాగిన మీటింగ్‌లో రాజధాని అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. రైతులు సహకరించకపోతే.. అమరావతి ఒక మున్సిపాలిటీగా మిగిలిపోతుందని అన్నారు. ప్రతి చిన్న విషయానికి సోషల్ మీడియాకు ఎక్కి రచ్చ చేయొద్దని, అంతర్గత విభేదాలతో సమస్యను పెద్దది చేయొద్దని సున్నితంగా హెచ్చరించారు. అమరావతి రైతుల్లో జేఏసీలు ఎక్కువగా ఉన్నాయని.. అందులో ఐకమత్యం లేదన్నారు. అందరూ ఒకేతాటిపై నిలబడి అమరావతి అభివృద్ధి కమిటీగా ఏర్పడాలని చంద్రబాబు సూచించారు.

# మారనున్న సింహాచలం రూపురేఖలు

విశాఖపట్టణం, నవంబర్ 29, సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన జరిగింది. నాల్కో సంస్థ సీఎస్ఆర్ కింద్ ఇచ్చిన రూ. 1.58 కోట్ల నిధులతో చేపట్టిన షెడ్లకు శంఖుస్థాపన చేశారు. ఇక కోల్‌కతాకు చెందిన ఓ భక్తుడు ఇచ్చిన రూ. 45 లక్షల విరాళంతో తొలిపావంచా వద్ద నిర్మించనున్న షెడ్డుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంఖుస్థాపన చేశారు. అంతేకాకుండా రూ. 3 కోట్లతో నిర్మించిన టీఎంఎస్ షెడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచల ఆలయ ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు.రాష్ట్రంలో ప్రధాన దేవాలయాల్లో ఒకటిగా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి పుణ్యక్షేత్రం వెలుగొందుతోంది. విశాఖపట్నం జిల్లాలో కొలువై ఉన్న సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకోవడానికి నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. అయితే ప్రస్తుతం ఈ ప్రసిద్ధ ఆలయం రూపురేఖలు మారుతున్నాయి. భక్తులు ఇచ్చిన విరాళాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే శ్రీచైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ బొప్పన ఝాన్సీ లక్ష్మీబాయి.. రూ.3 కోట్లు వెచ్చించి సింహగిరిపై టీఎంఎస్ (టెన్సిల్ మెంబ్రేన్ షెల్టర్) షెడ్డు నిర్మించారు.కాగా, ఈ టీఎంఎస్ షెడ్డు ప్రారంభోత్సవం సింహగిరిపై జరిగింది. ఝాన్సీ లక్ష్మీబాయి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో.. ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పి గణబాబు పాల్గొన్నారు. టీఎంఎస్ షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. కేవలం వంద రోజుల వ్యవధిలో.. నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేశారని చెప్పారు. దాతలకు, గుత్తేదారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.ఈ షెడ్డు ప్రారంభంతో పాటు పలు అభివృద్ధి పనుల శంఖుస్థాపన కార్యక్రమాల్లో గంటా శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వంపై విమర్శలు చేశారు. సింహాచలం దేవస్థానంలో వైసీపీ పాలనలోని అవశేషాలను తొలగిస్తామన్నారు. గత ప్రభుత్వంలోని కొందరు సింహాచల క్షేత్రాన్ని వివాదాలకు చిరునామాగా మార్చారని.. తాము ఈ దేవస్థానాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసి పూర్వవైభవం తీసుకువస్తామని చెప్పారు. అంతేకాకుండా గత కొన్నాళ్లుగా స్వామివారి ఆభరణాల లెక్కల్లో తేడాలు వస్తున్నాయని సంచలన ఆరోపణలు చేశారు. ఉద్యోగుల వ్యవహారాలు, తదితర ఆరోపణలు ఆలయ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయని అన్నారు. ప్రసాద్ పథకం పనులు త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని వెల్లడించారు.సింహాచల కొండపై విరాళాలతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు చేశారు. అందులో లోవతోటలో రూ. 98 లక్షలతో, ఆలయ ప్రాకారం చుట్టూ రూ. 60 లక్షలతో.. నాల్కో సంస్థ కార్పొరెట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో చేపట్టిన షెడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.

# ఆ మూడు ఆస్పత్రులకు మంచి రోజులు

గుంటూరు, నవంబర్ 29, ప్రజారోగ్యం, ఆసుపత్రుల అభివృద్ధిపై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా మూడు ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించింది. పిఠాపురం, మంగళగిరి, చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం ఏపీ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి 22 కోట్ల 74 లక్షల రూపాయలు అదనపు నిధులు కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి నుంచి దీనికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల అయ్యాయి.ప్రజారోగ్యంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కీలక చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రులలో మౌలిక వసతుల కల్పన, అధునాతన వైద్య చికిత్సలు అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మూడు నియోజకవర్గాలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త వినిపించింది. రాష్ట్రంలోని మూడు ఏరియా ఆస్పత్రులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిధులు కేటాయించింది. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ విభాగానికి ఏపీ ప్రభుత్వం ఈ మేరకు రూ.22.74 కోట్లు అదనపు నిధులు కేటాయించింది. మంగళగిరి. పిఠాపురం ఏరియా ఆస్పత్రి , చిలకలూరిపేట ఏరియా ఆస్పత్రుల అభివృద్ధి కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు. ఈ మేరకు ఏపీ వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ ఉత్తర్వులు జారీ చేశారు.మరోవైపు మంగళగిరి ఏరియా ఆస్పత్రి సామర్థ్యం ప్రస్తుతం 30 పడకలు మాత్రమే. ప్రజా అవసరాల నేపథ్యంలో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలని.. ఈ ఆస్పత్రికి అదనంగా 73 పోస్టులు కేటాయించాలని నిర్ణయించారు. ఆ నిర్ణయానికి అనుగుణంగా అదనపు పడకలు, అదనపు పోస్టుల కోసం రూ.52.20 కోట్లు కూడా కేటాయించారు. అలాగే మంగళగిరి ఏరియా ఆస్పత్రిని చినకాకాని వద్ద ఉన్న వైవీసీ క్యాన్సర్ ఆసుపత్రి స్థలంలో నిర్మించాలని నిర్ణయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేశారు. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం పాడవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు మంత్రి నారా లోకేష్ మంగళగిరి ఏరియా ఆస్పత్రి నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ ఆస్పత్రిని కార్పొరేట్ వసతులతో నిర్మించాలని.. అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని అధికారులకు ఇప్పటికే సూచనలు చేశారు. మంగళగిరి ఏరియా ఆస్పత్రిని గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్.. రెండు అంతస్తులో నిర్మిస్తున్నారు.రోగులకు ఉపయోగపడేలా ఆస్పత్రిలో లిఫ్ట్ ఏర్పాటు చేయనున్నారు. విశాలమైన పార్కింగ్ స్థలం కేటాయించనున్నారు. ఈ ఏరియా ఆస్పత్రికి మంగళగిరి నియోజకవర్గం నలుమూలల నుంచి చికిత్స కోసం ప్రజలు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రోగులతో పాటుగా వారి బంధువుల కూడా అసౌకర్యం కలగకుండా వసతి ఏర్పాట్లు చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనితో పాటుగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం ఏరియా ఆస్పత్రికి కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది.

## "ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం"ను జయప్రదం చేద్దాం..

దివ్యాంగులకు అండా,దండగా నిలుద్దాం.!..
- ఎంఎల్ఏ, పిఏసి సభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి..



విభారే న్యూస్ నవంబర్ 29 ఎమ్మిగనూరు..శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని శాసనసభ్యులు డాక్టర్ బి వి జయ నాగేశ్వర రెడ్డి నివాసంలో రాష్ట్ర "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) గౌరవాధ్యక్షులు మల్లేల్రఫ్ట్రైడ్ రాజు, అధ్యక్షులు బి సి నాగరాజు ల అధ్యక్షతన డిఈఎఫ్ ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో జరపబోయే "ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వారోత్సవాలు" లో భాగంగా డిసెంబర్ - 14(ఆదివారం) న తాలుకాలోని దివ్యాంగులందరిని క్రోడీకరించి టౌన్ లోని "కుర్ణి కళ్యాణ మండపం" లో "ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం" ను జరపబోతున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు(ఎంఎల్ఏ), పిఏసి సభ్యులు డాక్టర్ శ్రీ బి వి జయ నాగేశ్వర రెడ్డి ని ఆయన స్వగృహంలో కలిసి ఆహ్వానించడం తో పాటు ఆయన చేతుల మీదుగా "కరపత్రాలు"," గోడపత్రికలు" లను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఏ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరు అవుతానని జయప్రదం చేసుకుందామని అలాగే దివ్యాంగులకు ఎప్పుడు వెన్నంటి ఉ ఒడడమే గాక వారికి అండగా, దండగా నిలుస్తానని తెలియజేడం జరిగిందని తెలిపారు తప్పకుండా నియోజకవర్గంలోని అన్ని మండలాల, గ్రామాల్లోని దివ్యాంగులందరూ తప్పకుండా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఈఎఫ్ జిల్లా మహిళా విభాగం సభ్యురాలు తాలుకా డిఈఎఫ్ అధ్యక్షులు శాకం వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు ఇస్మాయిల్, మండల అధ్యక్షులు ఎం రామకృష్ణ, కో-కన్వీనర్స్ ఉసేని, మహేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్ ముస్తాక్, రాజశేఖర్ గౌడ్,ఆఫీసు బాయ్ నర్సింహులు, మీడియా విభాగం సభ్యులు సోమప్ప,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాతృ శిశు మరణాలపై కలెక్టర్ రాజకుమారి కఠిన ఆదేశాలు


**విధుల్లో అలసత్వం సహించం-నిర్లక్ష్యంపై సోకాజు నోటీసులు**




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 29-జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న మాతృ?శిశు మరణాలపై జిల్లా కలెక్టర్?మ్యాజిస్ట్రేట్ జి. రాజకుమారి గనియా అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. చాపిరేవుల, గడివేముల పీహెచ్‌సీలలో రెండు మాతృ మరణాలు, వేల్పనూరు, నరసాపురం, ప్యాపిలి పీహెచ్‌సీలలో మూడు శిశు మరణాలను ఈ సమావేశంలో పరిశీలించారు.కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ?గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలను ఆశా, ఏఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు ముందుగానే గుర్తించి అవసరమైన పరీక్షలు, పోషణ సకాలంలో అందించాలని ఆదేశించారు. సకాలంలో సేవలు అందిస్తేనే మాతృ?శిశు మరణాలు తగ్గుతాయని, ఇకపై విధుల్లో అలసత్వం అసలు సహించబోమని స్పష్టం చేశారు.జిల్లా వైద్యాధికారి డా. ఆర్. వెంకటరమణ మాట్లాడుతూ?గ్రౌండ్ స్టాఫ్‌పై కఠిన పర్యవేక్షణ కొనసాగిస్తామని, నిర్లక్ష్యం చేసిన వారిపై సోకాజు నోటీసులు జారీచేస్తామని హెచ్చరించారు.సమావేశంలో డా. ఓ. లలిత, డా. ప్రసన్నలక్ష్మి, డా. శ్రీజ, గైనిక్ విభాగం డా. జి. సుధారాణి, డా. సలీమున్నీసా, చిన్నపిల్లల విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా. కె. అరుణజ్యోతి, డా. మాధవి, డెమో ఇంచార్జ్ కె. మద్దిలేటి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


## డిసెంబర్ 3న వికలాంగుల దినోత్సవం ఘనంగా జరపాలి :వెంకట దాస్ మెప్మా పీడీ

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 29:డిసెంబర్ 3వ తేదీన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని పురపాలక సంస్థలు ఘనంగా నిర్వహించాలని నంద్యాల జిల్లా మెప్మా పీడీ వెంకటదాస్ సూచించారు.మెప్మా ఆధ్వర్యంలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల స్వయం సహాయ సంఘాలు, టౌన్ వికలాంగుల సమాఖ్యల అర్హత కలిగిన సభ్యులకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి, అదే రోజున మెగా చెక్కుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు.వికలాంగుల సాధికారత కోసం ఈ దినోత్సవాన్ని సేవాభావంతో నిర్వహించాలనీ, అర్హులందరికీ రుణ ప్రయోజనాలు చేరేలా ప్రతి పట్టణంలో స్పష్టమైన చర్యలు తీసుకోవాలని పీడీ వెంకటదాస్ కోరారు.వికలాంగుల ఆత్మవిశ్వాసం పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలను కూడా నిర్వహించాలని సంబంధిత సంస్థలను ఆయన ఆహ్వానించారు.



# తల్లి నమ్మకం నుండి పసిపిల్లల ప్రేమ వరకు: హిమాలయా బేబీకేర్, 'బేబీస్ లవ్' బ్రాండ్‌గా తన అగ్రస్థానాన్ని ప్రకటించింది

శిశువులు తమ అంతిమ ప్రభావితాలు గా 'అమ్మ' మరియు 'డాక్టర్' అని ప్రకటించే ఉల్లాస భరితమైన ప్రచారాన్ని బ్రాండ్ ఆవిష్కరించింది, ఇది భారతదేశంలో అత్యంత ప్రియమైన బేబీ కేర్ బ్రాండ్‌గా బ్రాండ్ యొక్క స్థానాన్ని పునరుద్ఘాటించింది.విభారే న్యూస్. నెట్ వర్క్‌జాతీయం, నవంబర్ 29, 2025: హిమాలయా బేబీకేర్ 'బేబీస్ లవ్' బ్రాండ్‌గా తన స్థానాన్ని హృదయాన్ని హత్తుకునే కొత్త ప్రచారంతో జరుపుకుంటోంది, ఇది శిశువులను దాని కథలో ముందు మరియు మధ్యలో ఉంచుతుంది. "వైద్యులు సిఫార్సు చేయబడినది, తల్లులు విశ్వసించినది మరియు శిశువులు ప్రేమించినది" అనే శీర్షికతో, ఈ ప్రచారం శిశువులు ప్రేమించే, తల్లులు విశ్వసించే మరియు వైద్యులు సిఫార్సు చేసే బ్రాండ్‌గా ఉన్న ప్రత్యేక బలాన్ని హైలైట్ చేస్తుంది. ఈ బలమైన నమ్మకం పునాదిపై నిర్మించబడిన ఈ ప్రచారం, అమాయకమైన ఇంకా శక్తివంతమైన శిశువుల గళాలను పట్టుకుని, నమ్మకం మరియు సంరక్షణ యొక్క బ్రాండ్ సందేశానికి వారిని కేంద్రంగా ఉంచే, ఉల్లాసభరితమైన మరియు భావోద్వేగపూరితమైన కథనం ద్వారా వర్గంలో హిమాలయా బేబీకేర్ యొక్క నాయకత్వాన్ని పునరుద్ఘాటిస్తుంది. సృజనాత్మక విజువలైజేషన్‌ను ఉపయోగించి, ఈ చిత్రం శిశువులకు ఒక గళాన్ని కల్పిస్తుంది, తల్లిదండ్రులు ఇప్పటికే నమ్మిన విషయాన్ని వ్యక్తం చేస్తుంది?దీని వలన కథనం హృదయపూర్వకంగా మరియు ప్రతీకాత్మకంగా ఉంటుంది.ఈ చిత్రం 'ఆల్ ఇండియా టైని టాక్ సమ్మిట్' తర్వాత విలేకరుల సమావేశపు సెట్టింగ్‌లోకి ఉల్లాసంగా అడుగు పెడుతుంది, ఇక్కడ రిపోర్టర్లు ప్రపంచంలోనే అత్యంత నిజాయితీ గల అభిప్రాయం కలిగి ఉన్నవారు: శిశువులను ఇంటర్వ్యూ చేయడానికి గుమికూడారు. వారి అభిమాన ప్రభావితం గురించి అడిగినప్పుడు, ఒక శిశువు మధురంగా "అమ్మ" అని సమాధానం ఇస్తుంది, తల్లి ఎల్లప్పుడూ బిడ్డకు మొదటి మరియు అత్యంత విశ్వసనీయ మార్గదర్శి అవుతుందని మనకు గుర్తుచేస్తుంది. మరొక శిశువు, ఎవరి సలహాపై ఆధారపడతారని అడిగినప్పుడు, "డాక్టర్" అని సమాధానం ఇస్తుంది, ఇది తల్లిదండ్రులు శిశువైద్యులపై ఉంచే నమ్మకాన్ని బలపరుస్తుంది.తల్లులు విశ్వసించినప్పటికీ మరియు






వైద్యులు సిఫార్సు చేసినప్పటికీ, హిమాలయా బేబీకేర్ అనేది శిశువులు ప్రేమించే బ్రాండ్ అనే సరళమైన, అయినప్పటికీ ప్రభావవంతమైన సందేశంతో ఈ ప్రచారం తెలివిగా ముగుస్తుంది, ఇది హాస్యభరితమైన, ముద్దుగా మరియు వెచ్చని స్వరంలో అందించబడింది.ఈ ప్రచారం గురించి హిమాలయా వెల్‌నెస్ కంపెనీ బిజినెస్ డైరెక్టర్ శ్రీ రాజేష్ కృష్ణమూర్తి మాట్లాడుతూ: "హిమాలయా బేబీకేర్ వద్ద, మా ప్రయాణం ఎల్లప్పుడూ శిశువులే ముందు అనే నమ్మకంతో మార్గనిర్దేశం చేయబడింది. ఈ ప్రచారం మేము అత్యంత శ్రద్ధ వహించే వారికి?శిశువులకు?గళాన్ని ఇవ్వడం ద్వారా ఆ భావాన్ని అందంగా పట్టుకుంది. శిశువులు ప్రేమించడం అనేది మేము సంపాదించగలిగే అత్యున్నత నమ్మకం, మరియు ఇది తల్లులు మరియు వైద్యులు మా ఉత్పత్తులపై ఉంచే విశ్వాసం ద్వారా సాధ్యమైంది. ఈ ప్రచారం శిశువులే మా ప్రధాన ప్రాధాన్యత అని మరియు వారి నిర్దిష్ట అవసరాలను తీర్చడానికి మేము ఉత్పత్తులను రూపొందించినప్పుడు భద్రత అనేది ముందంజలో ఉంటుందనే మా నమ్మకాన్ని బలపరుస్తుంది. హిమాలయా బేబీకేర్ వద్ద, మేము శిశువులకు ప్రకృతి యొక్క ఉత్తమమైన వాటిని మరియు తల్లులకు చింత లేని అనుభవాన్ని అందించడానికి కట్టుబడి ఉన్నాము?సంరక్షణ మరియు విశ్వాసంతో శిశువులను పెంచే మా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాము." అని అన్నారు.ఈ ప్రచారం ఎనిమిది భాషల్లో?ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, మరాఠీ మరియు బెంగాలీ?రూపొందించబడింది, ఈ సందేశం భారతదేశం అంతటా తల్లిదండ్రులతో గాఢంగా ప్రతిధ్వనించేలా చూస్తుంది. ఈ ఆవిష్కరణకు జోడించి, ఈ చిత్రం మాట్లాడే శిశువులను సృష్టించడానికి ఒఎని ఉపయోగిస్తుంది, కథనం యొక్క మాధుర్యాన్ని మరియు హాస్యాన్ని పెంచుతుంది.భారతదేశం యొక్క అత్యంత విశ్వసనీయ బేబీ కేర్ భాగస్వామిగా, హిమాలయా బేబీకేర్ ఆయుర్వేదాన్ని సమకాలీకరించడం కొనసాగిస్తోంది, ఇది సున్నితమైన, సురక్షితమైన మరియు ప్రభావవంతమైన ఉత్పత్తులను సృష్టించడానికి?సంవత్సరాలుగా వైద్యులు మరియు తల్లుల నమ్మకాన్ని సంపాదిస్తోంది.చఊతిఎజీశ్రీజీఎజీఃజీఎఅజీతీవ, 'వైద్యులు సిఫార్సు చేయబడినది, తల్లులు విశ్వసించినది మరియు శిశువులు ప్రేమించినది' అనే ఈ ప్రచారం హిమాలయా బేబీకేర్ యొక్క డిజిటల్ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రారంభించబడింది.

## డోన్ ప్యాపిలిలో చెరువుల పరిశీలన నీటి సమస్యల పరిష్కారానికి చర్యలు : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 29:డోన్?ప్యాపిలి మండలాల్లో సాగు నీరు, తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డితో కలిసి అబ్బిరెడ్డిపల్లి, వెంగలాంపల్లి, పిఆర్ పల్లి, గుడిపాడు, చంద్రపల్లి, హుసేనాపురం గ్రామాల చెరువులను పరిశీలించారు. వెంకటాపురం తుమ్మల చెరువులో ప్రత్యేక జలహారతి కార్యక్రమంలో పాల్గొన్నారు .రైతులతో మాట్లాడిన కలెక్టర్? సాగు నీరు, తాగునీటి సమస్యలు త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నంద్యాల జిల్లాలోని 35 చెరువుల్లో 7 చెరువులకు ద్వారా నీరు అందక పోవడంతో ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నట్టు వెల్లడించారు. చెరువుల నింపుదల, నీటి సరఫరాపై మైనర్



ఇరిగేషన్ అధికారులతో సమీక్షించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. చెరువుల చుట్టుపక్కల ఉన్న ముళ్ళ కంచెలు, అడవి చెట్ల తొలగింపుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామని చెప్పారు.తాగునీటి సమస్యలపై ఫోకస్‌కొన్ని గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఉన్నాయని గుర్తించిన కలెక్టర్? అవసరమైన నిధుల అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. త్వరలోనే తాగునీటి సమస్యలపై ప్రత్యక్ష చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రహదారి సమస్యకు పరిష్కారంవెంకటాపురం?మల్లెంపల్లి మార్గంలో నీరు ప్రవహించడం వల్ల 1500 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిసిన కలెక్టర్? బ్రిడ్జి ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.డోన్ ఆర్డీఓ నరసింహులు, తాసిల్దార్లు, మైనర్ ఇరిగేషన్ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కుక్కల కూనీ ఆపరేషన్లకు బ్రేక్ - డాక్టర్ జ్వరంతో నిలిచిన శస్త్రచికిత్సలు

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 29 - నంద్యాల పట్టణంలో గత పది రోజులుగా కుక్కల కూనీ ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో వేల సంఖ్యలో వీధి కుక్కలు సంచరిస్తుండగా, ఇప్పటివరకు సుమారు 1400 వరకు మాత్రమే కూనీ ఆపరేషన్లు జరిగినట్లు సమాచారం. మిగతా కుక్కల విషయంలో తక్షణ చర్యలు తీసుకోకపోవడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతోంది.వెటర్నరీ డాక్టర్‌కు జ్వరం రావడం కారణంగా ఆపరేషన్లు ఆగిపోయాయని అధికారులు చెబుతుండగా, మరో డాక్టర్‌ను నియమించి కార్యక్రమం కొనసాగించవచ్చుకదా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కుక్కల సంఖ్య నియంత్రణ లేకపోవడంతో దాడులు,




పిల్లలపై భయం, రాత్రివేళల్లో సంచారానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.ఈ విషయంలో మున్సిపల్ అధికారులు పట్టి పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఎస్పీసీ జిల్లా కమిటీ సభ్యులు కూడా దీనిపై స్పందించకుండా మౌనం పాటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.పట్టణంలో ప్రజల భద్రత దృష్ట్యా వెంటనే ప్రత్యామ్నాయ డాక్టర్‌ను నియమించి కూనీ ఆపరేషన్లు పునఃప్రారంభించాలని, నిర్లక్ష్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

## సుదీర్ఘ సేవలు గుర్తించి రిటైర్డ్ పోలీసులకు ఎస్పీ సునీల్ షొరాణ్ సన్మానం




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 29-నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో పదవి విరమణ పొందిన పోలీసులను జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ శాలువతో పూలమాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.ఎస్పీ సునీల్ షొరాణ్ మాట్లాడుతూ బాధ్యతాయుతంగా క్రమశిక్షణతో పోలీసులు సుదీర్ఘకాలం సేవలందించడం ప్రశంసనీయమని రిటైర్డ్ సిబ్బంది సేవలు చిరస్మరణీయమని అభినందించారు.జి ముకుందారెడ్డి హెడ్ కానిస్టేబుల్ రెండవ టౌన్ పోలీస్ స్టేషన్ నంద్యాల1989లో కానిస్టేబుల్ గా చేరి మొత్తం 37 సంవత్సరాలు వివిధ స్టేషన్లలో సేవలందించారు.ఈ నాగేంద్రుడు ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ నంద్యాల1994లో ఏపీఎస్పీ కానిస్టేబుల్ గా చేరి 2009లో ఆర్మ్డ్ రిజర్వ్ లోకి మార్పిడి 2020లో హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొంది మొత్తం 31 సంవత్సరాలు సేవలందించారు. ఎస్పీ సునీల్ షొరాణ్ రిటైర్డ్ సిబ్బంది కుటుంబ వివరాలు పిల్లల చదువులు ఉద్యోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. పదవి విరమణ అనంతరం కూడా మీరు పోలీసు కుటుంబ సభ్యులేనని భవిష్యత్తులో ఎలాంటి సహాయం కావాలన్నా పోలీసు శాఖ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని తెలిపారు. రిటైర్మెంట్ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి జిల్లా సాయుధ బలగాల డీఎస్పీ శ్రీనివాస్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు మంజునాథ్ సురేష్ బాబు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్ల సేవలపై కమిషనర్ శేషన్న ఆకస్మిక తనిఖీలు

--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 29నంద్యాల పట్టణంలోని అన్న క్యాంటీన్లలో అందిస్తున్న భోజన పంపిణీ విధానం, పరిశుభ్రత, సేవా ప్రమాణాలపై మున్సిపల్ కమిషనర్ బి శేషన్న శనివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. భోజనం ఇతర కేంద్రాల నుంచి సరఫరా అవుతున్నందున, ఆహారం స్వీకరణ, నిల్వ విధానం, పంచే విధానం, ప్రజలకు అందుతున్న సేవల నాణ్యతను కమిషనర్ పరిశీలించారు.ప్రతి క్యాంటీన్‌లో సిబ్బంది ప్రజలతో వ్యవహరించే తీరు, క్యాంటీన్‌లోని పరిశుభ్రత, నీటి సదుపాయాలు, కూర్చునే ఏర్పాట్లపై కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు.లోపాలుఎక్కడ ఉన్నా వెంటనే సరిదిద్దాలని కమిషనర్ లక్ష్మీ నారాయణ, శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.




EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**